### ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించాలి

మేడ్చల్, జూలై1(నమస్తే తెలంగాణ): రాష్ట్ర స్థాయిలో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమానికి ఇప్పటి వరకు మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాకు సంబంధించిన పెండింగ్ దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ గౌతమ్ అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో కలెక్టర్ గౌతమ్, అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి పాల్గొని దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... అధికారులు తమ పరిధిలో ఇప్పటి వరకు ప్రజావాణిలో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని, మీ పరిధిలో పరిష్కరించలేని దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి ఆన్‌లైన్‌లోనే దరఖాస్తుదారునికి వివరణ ఇవ్వాలని సూచించారు. ప్రజావాణి కార్యక్రమంలో 114 దరఖాస్తులు వచ్చాయని, సంబంధిత అధికారులు పరిశీలించి ప్రజలకు న్యాయం చేయాలన్నారు.

### ప్రజావాణికి 140 దరఖాస్తులు

సిటీబ్యూరో, జులై 1(నమస్తే తెలంగాణ): పలు సమస్యలపై ప్రజావాణికి 140 దరఖాస్తులు వచ్చినట్లు జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. సోమవారం కలెక్టరేట్ కార్యాలయంలో వచ్చిన ఫిర్యాదులను స్వీకరించి.. తక్షణమే సమస్యల పరిష్కారానికి అధికారులు చొరవ తీసుకోవాలని ఆదేశించారు. వచ్చిన ఫిర్యాదుల్లో అత్యధికంగా గృహ నిర్మాణ శాఖకు చెందినవి 79 ఉన్నాయని, పెన్షన్‌కు సంబంధించినవి 16, డీఈవోకు 3, దివ్యాంగుల సంక్షేమ శాఖకు 4, ఎస్సీ కార్పొరేషన్‌కు 11, ఇతర అంశాలపై మరో 30 దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి వెంకటాచారి, ఆర్డీవోలు మహిపాల్, దశరథ్ సింగ్, జిల్లా అధికారులు, తహసీల్దార్లు పాల్గొన్నారు.

### 19న ఎన్‌ఈఈఆర్‌ఐ జాతీయ సదస్సు

సిటీబ్యూరో, జూలై 1(నమస్తే తెలంగాణ): నేషనల్ ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీరింగ్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ (ఎన్‌ఈఈఆర్‌ఐ) హైదరాబాద్ జోనల్ సెంటర్ ఆధ్వర్యంలో ఈ నెల 19న జాతీయ సదస్సు జరగనుంది. 'ఎన్విరాన్‌మెంటల్ ఇంపాక్ట్ అసెస్‌మెంట్ - రీసోర్స్ మేనేజ్‌మెంట్ అండ్ పాలసీ మేకింగ్' అనే అంశంపై యూసుఫ్‌గూడలోని ఎన్-ఎంఎస్‌ఎంఈ కార్యాలయంలో నిర్వహించనున్నారు. ఎన్విరాన్‌మెంటల్ ఇంపాక్ట్ అసెస్‌మెంట్(ఈఐఏ)పై ఉన్న నిబంధనలు, అమలు తీరు, నిర్వహణ విధానాలపై చర్చించనున్నారు. అదే విధంగా పర్యావరణ పరిశోధకులు, పర్యావరణవేత్తలు, విద్యార్థులు, రీసెర్చ్ స్కాలర్లు, పాలసీ మేకర్లు పాల్గొనే ఈ సదస్సులో ఈఐఏ మూల్యాంకన, వనరుల నిర్వహణ, పాలసీ మేకింగ్ థీమ్‌లపై సుదీర్ఘంగా చర్చించనున్నట్లుగా సీఎస్ఐఆర్-ఎన్‌ఈఈఆర్‌ఐ వర్గాలు తెలిపారు.

### గ్రేటర్‌కు వర్ష సూచన

సిటీబ్యూరో, జూలై 1(నమస్తే తెలంగాణ): రుతు పవనాల ప్రభావంతో రాగల రెండు రోజులు గ్రేటర్‌లోని పలు చోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వానలు కురిసే అవకాశాలున్నట్లు హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు వెల్లడించారు. కాగా, సోమవారం ఉదయం నుంచి రాత్రి వరకు నగరంలో గరిష్ట ఉష్ణోగ్రతలు 30.7 డిగ్రీలు, కనిష్ట ఉష్ణోగ్రతలు 23.4 డిగ్రీలు, గాలిలో తేమ 63% నమోదైనట్లు అధికారులు వెల్లడించారు.

### జల మండలిలో ఉద్యోగుల పదవీ విరమణ

సిటీబ్యూరో, జూలై 1(నమస్తే తెలంగాణ): జల మండలి పరిధిలోని వివిధ ప్రాంతాల్లో పనిచేస్తున్న 51 మంది ఉద్యోగులు పదవీ విరమణ పొందారు. ఈఎన్సీ, ఆపరేషన్స్ డైరెక్టర్-1గా విధులు నిర్వర్తించిన అజ్మీరా కృష్ణ, ఓ అండ్ ఎం డివిజన్ సీజీఎం శ్రీధర్ రెడ్డి, ప్రాజెక్టు డీజీఎం రహమాన్ సహా పలు స్థాయిలో పనిచేసే ఉద్యోగులున్నారు. వీరందరినీ ఖైరతాబాద్‌లోని ప్రధాన కార్యాలయంలో అధికారులు, సిబ్బంది ఘనంగా సత్కరించి వీడ్కోలు పలికారు. పదవీ విరమణ ద్వారా లభించే గ్రాట్యుటీ వంటి తదితర ప్రయోజనాలు చెక్కు రూపంలో అందజేశారు. కార్యక్రమంలో డైరెక్టర్లు వీఎల్ ప్రవీణ్ కుమార్, రవి కుమార్, స్వామి, రఘు, విజయరావు, పీ అండ్ ఏ సీజీఎం మహమ్మద్ అబ్దుల్ ఖాదర్, జీఎం సరస్వతి ఉద్యోగులు పాల్గొన్నారు.

# ఔట్‌సోర్సింగ్.. అవినీతి పర్వం

- కార్మికుల పీఎఫ్, ఈఎస్‌ఐ నిధులు పక్కదారి
- రికార్డుల్లో ఎక్కువ, క్షేత్రస్థాయిలో తక్కువ మంది
- ఫిర్యాదులు వచ్చిన ఏజెన్సీలపై చర్యలు తీసుకోని జలమండలి
- ఉన్నతాధికారుల బంధువులు, యూనియన్ నేతలదే హవా
- ఏజెన్సీల రికార్డులను క్షేత్ర స్థాయి తనిఖీలు జరపాలని కార్మికుల డిమాండ్



సిటీబ్యూరో, జూలై 1(నమస్తే తెలంగాణ ): ఎస్‌ఆర్ నగర్ ఎల్లారెడ్డి సెక్షన్‌లో ఔట్‌సోర్సింగ్ విధానంలో పనిచేసే చంద్రశేఖర్‌కు ఇటీవల జరిగిన ఆటో ప్రమాదంలో కాలు, చేతి విరిగి అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. కుటుంబ సభ్యులు ఈఎస్‌ఐలో చేర్పిస్తే సకాలంలో వైద్యం అందలేదు..కారణం ఈఎస్‌ఐ చెల్లింపులు సక్రమంగా లేకపోవడమే. మానవతా దృక్పథంతో తక్షణమే యూనియన్ ప్రతినిధులు, సంబంధిత డివిజన్ ముఖ్య అధికారులు స్పందించి వైద్య సహాయం అందించారు. ఈ ఘటన నేపథ్యంలో కార్మికులకు ఈఎస్‌ఐ, పీఎఫ్ సకాలంలో చెల్లించడం లేదంటూ సంబంధిత సుమతి ఏజెన్సీపై జల మండలి కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు నారాయణ అధికారులకు ఫిర్యాదు చేశారు. అంతేకాదు గతంలో ఖైరతాబాద్ కేంద్రంగా పనిచేసిన ఓ ఏజెన్సీ దాదాపు 300 మంది కార్మికులకు 10 నెలలకు పైబడి పీఎఫ్ చెల్లించకుండానే జెండా ఎత్తేసింది. చర్యలు తీసుకోవాల్సిన జల మండలి.. ఏజెన్సీ పక్షాన నిలబడటంతో కార్మికులు తీవ్రంగా నష్ట పోయారు. ఇక్కడ ఈ ఏజెన్సీలే కాదు జల మండలి పరిధిలో ఉన్న చాలా ఏజెన్సీలు కార్మికుల జీవితాలతో చెలగాటమాడుతున్నాయి. బోర్డు నుంచి నిధులు తీసుకుంటూ సకాలంలో వారికి జీతాలు చెల్లించడం లేదు. మరోవైపు వేతనాల నుంచి పీఎఫ్, ఈఎస్ఐ సక్రమంగా చెల్లించడం లేదు. వాస్తవంగా ఔట్‌సోర్సింగ్ ప్రాతిపదికన పనిచేసే ప్రతి కార్మికుడికి ఏజెన్సీ సకాలంలో వేతనం ఇవ్వడమే కాదు.. ఈఎస్‌ఐ కార్డులు అందించాలి. ఆ తర్వాత పీఎఫ్‌కు సంబంధించి కార్మికుడి ఫోన్ నంబరుకు ఈపీఎఫ్ చెల్లింపునకు సంబంధించిన పేమెంట్ (వివరాలు) అందేలా చూడాలి. ప్రతి కార్మికుడి ఈపీఎఫ్ తాలుకా నంబరు వివరాలను సంస్థకు అందజేయాలి. కానీ చాలా ఏజెన్సీలు కార్మికుల పీఎఫ్, ఈఎస్ఐ విషయంలో పారదర్శకత పాటించడం లేదు. కాసులకు కక్కుర్తిపడే కొందరు అధికారుల అండదండలతో కార్మికుల శ్రమను దోపిడీ చేస్తున్నాయి. సిబ్బంది, సంస్థ ఖజానాకు కన్నం పెడుతున్నది. జాబితాల్లో ఎక్కువ మంది చూపి, క్షేత్రస్థాయిలో అంతకంటే తక్కువ మందితో పనిచేస్తున్నాయి. వేతనాల విషయంలో మాత్రం వీరందరి పేరుతో వసూలు చేస్తున్నారు. ఫలితంగా మండలి ఆదాయానికి భారీగా గండిపడుతుందన్న ఆరోపణలు లేకపోలేదు.

#### జల మండలిలో 4,500 మంది ఉద్యోగులు

జలమండలి పరిధిలో 3,800 మంది రెగ్యులర్ ఉద్యోగులు ఉంటే ఔట్‌సోర్సింగ్‌లో దాదాపు 4,500 మంది పనిచేస్తున్నారు. సుమారు 8 ఏజెన్సీల నిర్వహణలో కంప్యూటర్ ఆపరేటర్, డేటా ఆపరేటర్లు, లైన్‌మెన్లు, లిఫ్ట్ బాయ్‌లు, క్లర్క్‌లు, సెక్యూరిటీ గార్డులు, కార్యాలయ సహాయకులు పనిచేస్తున్నారు. అలాగే ఔట్ సోర్సింగ్ కార్మికులు పనిచేస్తున్నారు. ఆయా డివిజన్ల పరిధిలో ఔట్‌సోర్సింగ్ కార్మికుల నెలవారీగా అటెండెన్స్‌ను డివిజన్ -9కు పంపించి అక్కడి నుంచి ఏజెన్సీలకు నెలవారీ చెల్లింపులు జరుగుతున్నాయి. బోర్డు నుంచి తీసుకున్న నిధులను సంబంధిత కార్మికులకు ఏజెన్సీలు నెలజీతం చెల్లిస్తున్నాయి. అయితే ఔట్‌సోర్సింగ్ ఏజెన్సీలు అక్రమాలకు తెర లేపాయి. కొన్ని ఏజెన్సీలు సిబ్బంది లెక్కలను తారుమారు చేయడం, పీఎఫ్, ఈఎస్ఐ సొమ్ములు చెల్లించకపోవడం, తక్కువ మందితో పనిచేయించి జల మండలి నుంచి ఎక్కువ నిధులు రాబట్టడం వంటి అక్రమాలకు పాల్పడుతున్నాయి. అధికారులు మాత్రం ఏజెన్సీలు కార్మికులకు సకాలంలో ఈపీఎఫ్ చెల్లిస్తున్నాయా? లేదా? ఈఎస్ఐ కార్డులు ఇస్తున్నారా? అన్నది ప్రత్యేక వ్యవస్థతో తనిఖీలు చేస్తున్నామని చెబుతున్నారే తప్ప తరచూ కార్మికులు, కార్మిక సంఘాల నేతలు ఇచ్చిన ఫిర్యాదులపై మాట దాటవేస్తుండటం అధికారులకే చెల్లింది. ఉన్నతాధికారులు కార్మికుల పక్షాన నిలబడి ఏళ్ల తరబడి కొందరు ఉన్నతాధికారుల బంధువులు, యూనియన్ సంఘాల నేతలకు సంబంధించిన ఏజెన్సీలపై ఉక్కుపాదం మోపాలని కార్మికులు కోరుతున్నారు. శివారులో తాగు, సీవరేజీ విభాగంతో పాటు డివిజన్ 1, 2, 3, గోదావరి, కృష్ణా పథకంలో పనిచేసే ఔట్‌సోర్సింగ్ కార్మికుల లెక్కలపై క్షేత్రస్థాయిలో విచారణ జరిపించాలని కార్మికులు పేర్కొంటున్నారు. ఏదైనా ఘటన జరిగినప్పుడు ఏజెన్సీకి చెందిన వ్యక్తి బాధితుడి ఈపీఎఫ్ వివరాలను స్లిప్‌పై రాసిచ్చే విధానానికి స్వస్తి పలికి, ప్రతి కార్మికుడికి నెలవారీగా ఎంత పీఎఫ్ అమౌంట్ డిపాజిట్ జరిగిందో ఎస్‌ఎంఎస్ విధానంలో తెలుసుకునేలా అధికారులు చొరవ తీసుకోవాలని వేడుకుంటున్నారు.

## పీవీని యువత ఆదర్శంగా తీసుకోవాలి



పీవీ నరసింహా రావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ప్రముఖులు

తెలుగు యూనివర్సిటీ, జూలై 1: ఆర్థిక రంగంలో సంస్కరణలు తీసుకువచ్చిన పీవీ. నరసింహారావు దేశానికి దశ దిశను చూపిస్తూ అభివృద్ధికి బాటలు వేశారని ప్రభుత్వ సలహాదారు హర్కార వేణుగోపాలరావు అన్నారు. సుల్తాన్ బజార్‌లోని శ్రీకృష్ణదేవరాయ తెలుగు భాషా నిలయం ఆధ్వర్యంలో భారత పూర్వ ప్రధాని పీవీ.నరసింహారావు జయంతి సందర్భంగా వ్యాస రచన పోటీల్లో విజేతలైన విద్యార్థులకు బహుమతుల పంపిణీ కార్యక్రమం సోమవారం జరిగింది. ఈ కార్యక్రమానికి హాజరైన ప్రభుత్వ సలహాదారు హర్కార వేణుగోపాలరావు మాట్లాడుతూ... పీవీ తెలుగు జాతి, ఖ్యాతిని దేశంలో ఇనుమడింపజేశారని, ఆయనను ఆదర్శంగా తీసుకోవాలని నేటి యువతకు సూచించారు. విశ్రాంత ఐఏఎస్ అధికారి డాక్టర్ కె.వి రమణాచారి మాట్లాడుతూ.. పీవీ. నరసింహారావు వ్యక్తిత్వాన్ని, తెలుగు భాషకు ఆయన చేసిన సేవలను వివరించారు. అనంతరం ఎమ్మెల్సీ సురభి వాణీదేవి మాట్లాడుతూ..గొప్ప మేధా సంపత్తి కలిగిన తమను ఎంతో స్వేచ్ఛతో ప్రోత్సహించారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పీవీ కుటుంబ సభ్యులు డాక్టర్ కె.సరస్వతి, డాక్టర్ విజయ సామరాజు, పీవీ. ప్రభాకరరావు, భాషా నిలయం ఉపాధ్యక్షుడు కె.చంద్రప్రకాశ్ రావు, గౌరవ కార్యదర్శి టి.ఉదయవర్లు పాల్గొన్నారు.

## లోపాలను ముందే గుర్తించి మరమ్మతులు..

### గ్రేటర్ పరిధిలో 35 థర్మో విజన్ కెమెరాలు

సిటీబ్యూరో, జూలై 1 (నమస్తే తెలంగాణ): చిన్న చిన్న లోపాలతో విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా, ముందుగానే గుర్తించి మరమ్మతులు చేసేందుకు విద్యుత్ శాఖ అత్యాధునిక పరిజ్ఞానంతో కూడిన థర్మో విజన్ కెమెరాలను వినియోగిస్తోందని దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ ముషారఫ్ ఫరూఖీ తెలిపారు. సోమవారం ఖైరతాబాద్‌లోని డిస్కం కార్పొరేట్ కార్యాలయంలో ఉన్నతాధికారులతో ప్రత్యేకంగా సమీక్షా సమావేశం నిర్వహించారు. అనంతరం సీఎండీ మాట్లాడుతూ.. జీహెచ్‌ఎంసీ పరిధిలో నిరంతరం నాణ్యమైన విద్యుత్ అందించేందుకు కంపెనీ ప్రత్యేకంగా చర్యలు చేపట్టిందన్నారు. ఇందుకుగాను టీజీఎస్‌పీడీసీఎల్ సంస్థ ఇటీవల 35 అత్యాధునిక థర్మో విజన్ కెమెరాలను కొనుగోలు చేసిందని చెప్పారు. వీటిని గ్రేటర్ పరిధిలో ఉన్న 9 సర్కిళ్లలో క్షేత్ర స్థాయిలో పనిచేసే అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లకు పంపిణీ చేశామని, ఈ ఆధునాతన కెమెరాలు సాధారణంగా రెడ్ హాట్స్ అని పిలిచే ఉష్ణ క్రమరాహిత్యాలను గుర్తించేందుకు రూపొందించబడ్డాయన్నారు. అయితే ఇది ఓవర్ హెడ్ లైన్‌లు, బ్రేకర్లు, ట్రాన్స్‌ఫార్మర్లు, క్లాంప్‌లలో వదులుగా ఉండే వాటిని గుర్తిస్తుందని వివరించారు. ఇలాంటి సమస్యలను ముందుగానే గుర్తించడం ద్వారా డిస్కం పరిధిలో అంతరాయం రాకుండా ముందుగానే అవసరమైన నిర్వహణ మరమ్మతులు చేసేందుకు దోహదం చేస్తుందని సీఎండీ తెలిపారు.



## కొవిడ్ సమయంలో.. వైద్యుల సేవలు అభినందనీయం

జూబ్లీహిల్స్, జూలై 1: కరోనా విజృంభించిన కష్టకాలంలో వైద్యులు, వైద్య సిబ్బంది అందించిన సేవలు అభినందనీయమని, వైద్యం ఒక వృత్తిగా కాకుండా మనుషులను బ్రతికించే మహాశక్తిగా కొవిడ్ సమయంలో నిలిచిందని పలువురు వైద్యులు పేర్కొన్నారు. బీసీ రాయ్ జయంతిని పురస్కరించుకుని సోమవారం ఇండియన్ మెడికల్ సౌత్ జోన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక అమరావతి కన్వెన్షన్ హాలులో డాక్టర్స్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. వర్షాకాలంలో వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సుందర్ రావు, డాక్టర్ సోములు, డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ సుగుణాకర్ రెడ్డి, డాక్టర్ భాస్కర్, సతీశ్ పాల్గొన్నారు.

## గోల్కొండ బోనాల కమిటీ చైర్మన్‌గా అరవింద్



మెహిదీపట్నం జూలై 1: చారిత్రాత్మక గోల్కొండ కోటపై ఉన్న జగదాంబిక ఎల్లమ్మ ఆలయం నుంచి ప్రారంభం కానున్న ఆషాఢ మాసం బోనాల ఉత్సవాల కోసం తెలంగాణ ప్రభుత్వం ఎట్టకేలకు ఉత్సవ కమిటీని సోమవారం రాత్రి 10 గంటలకు ఖరారు చేసింది. ఎన్నడు లేనంతగా మొదటిసారి 14 మంది సభ్యులతో ఈ కమిటీని వేయడం జరిగింది. ముందుగా కేవలం ఉత్సవ కమిటీని వేస్తారని, సభ్యులంతా సమానంగా ఉంటారని కాంగ్రెస్ వర్గాల్లో చర్చ జరిగినా, పార్టీ సీనియర్ల చాతుర్యంతో ఎట్టకేలకు ఉత్సవ కమిటీ సభ్యులంతా చైర్మన్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. లంగర్‌హౌస్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కాంత నర్సింగరావు (చెన్నారెడ్డి) కుమారుడు, యువ నాయకుడు కాంత అరవింద్ మహేష్ కుమార్‌ను సభ్యులంతా ఏకగ్రీవంగా చైర్మన్‌గా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా చైర్మన్‌గా ఎన్నికైన అరవింద్ మహేష్ కుమార్ మాట్లాడుతూ, చైర్మన్‌గా కలిగిన అవకాశాన్ని పూర్తి స్థాయిలో సద్వినియోగం చేసుకుని బోనాలను అంగరంగ వైభవంగా నిర్వహించడానికి శాయశక్తులా కృషి చేస్తానని పేర్కొన్నారు. తనకు అవకాశం కల్పించిన సీఎం రేవంత్ రెడ్డికి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్‌లకు రుణపడి ఉంటానని అరవింద్ మహేష్ కుమార్ తెలిపారు. అందరి సహాయ సహకారాలతో తెలంగాణ ఆషాఢ మాసం గోల్కొండ బోనాలను ఎలాంటి అడ్డంకులు లేకుండా నిర్వహించడానికి శక్తి వంచన లేకుండా పనిచేస్తానన్నారు.

#### ఉత్సవ కమిటీ సభ్యులు వీరే..

గోల్కొండ బోనాల ఉత్సవ కమిటీ సభ్యులుగా అరవింద్ మహేశ్ కుమార్, కె.చంటి బాబు, శోభా పాండె, గోపిరెడ్డి నర్సింహారెడ్డి, నాగులపల్లి శ్రీకాంత్, కామళ్ల రాధిక, జానపల్లి రాకేశ్, బి.కృష్ణమూర్తి, సి.నవీన్ కుమార్, ఎ.అనిల్ యాదవ్, జి.నరేశ్ కుమార్, జి.నరేందర్ రెడ్డి, ఏ.సంతోష్ కుమార్ గౌడ్, మత్స రేణుకలు నియమితులయ్యారు. వీరంతా కలిసి అరవింద్ మహేష్ కుమార్‌ను చైర్మన్‌గా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

## ఘనంగా స్వస్తిక్ మిర్చీ స్టోర్ వ్యవస్థాపక దినోత్సవం




సిటీబ్యూరో, జూలై 1 (నమస్తే తెలంగాణ): స్వస్తిక్ మిర్చీ స్టోర్ వ్యవస్థాపక దినోత్సవాన్ని నగరంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతిభావంతులైన పేద విద్యార్థులను ప్రోత్సహించేందుకు కొత్త కార్యక్రమాన్ని ఆవిష్కరించింది. బేగంబజార్ కేంద్రంగా స్వస్తిక్ మిర్చీ స్టోర్‌ను దాంజీ జీవరాజ్ నగడ ప్రారంభించారు. వినియోగదారులకు నాణ్యమైన ఆహార ఉత్పత్తులను అందించి వారి ఆదరణను చూరగొంది. 1959లో ప్రారంభమైన స్వస్తిక్ కార్యకలాపాలు నిరంతరాయంగా తెలుగు రాష్ట్రాలతో పాటు కర్ణాటకలోనూ నిర్వహిస్తున్నారు. సంస్థాగతంగా, క్షేత్ర స్థాయిలో మహిళలకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రత్యేకంగా శిక్షణ తరగతులను నిర్వహిస్తోంది. అలాగే వ్యవస్థాపకులైన దాంజీ జీవరాజ్ నగడ పేరు మీద విద్యార్థులకు స్కాలర్ షిప్‌లను అందించే కార్యక్రమాన్ని ప్రారంభించామని, వ్యవస్థాపక దినోత్సవం రోజున 11 మంది విద్యార్థులను ఎంపిక చేశామని కంపెనీ ప్రతినిధి తెలిపారు.

## కాంట్రాక్టు కార్మికులను పర్మినెంట్ చేయండి

### సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి

హిమాయత్‌నగర్, జూలై 1: రాష్ట్ర వ్యాప్తంగా టూరిజం సంస్థలో కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ పద్ధతిలో పనిచేస్తున్న కార్మికులను పర్మినెంట్ చేయాలని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి అన్నారు. ఈ మేరకు తెలంగాణ టూరిజం ఎండీ ప్రకాశ్ రెడ్డిని హిమాయత్‌నగర్‌లోని టూరిజం ప్రధాన కార్యాలయంలో చాడ వెంకట్‌రెడ్డి సోమవారం కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా చాడ వెంకట్ రెడ్డి, తెలంగాణ టూరిజం కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సబ్బు రాజమౌళిలు మాట్లాడుతూ, టూరిజం సంస్థను నమ్ముకుని 25 ఏండ్లుగా చాలీ చాలని జీతాలు తీసుకుంటూ కార్మికులు విధులు నిర్వహిస్తున్నారని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని కోరారు. టూరిజం ఎండీ ప్రకాశ్ రెడ్డి సానుకూలంగా స్పందించి కాంట్రాక్టు ఉద్యోగుల పర్మినెంట్ అంశాన్ని ప్రభుత్వ దృష్టికి తీసుకువెళ్లి పర్మినెంట్ అయ్యేందుకు తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారని వారు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు గోపి, జ్యోతి, రాజ్యలక్ష్మి, సుకన్య, రచన, హైమావతి, మధురారెడ్డి, ఉడుత రమేశ్, ఇక్బాల్ పాల్గొన్నారు.



ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని సోమవారం కలిసి పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఈవీడీఎం కమిషనర్ ఏవీ రంగనాథ్

- జూబ్లీహిల్స్, జూలై 1

### ఘనంగా ఎస్‌బీఐ బ్యాంక్ డే వేడుకలు



ఎస్‌బీఐ హైదరాబాద్ సర్కిల్ 69వ స్టేట్ బ్యాంక్ డేను పండుగ వాతావరణంలో జరుపుకున్నారు. సీఎస్ఆర్ కార్యక్రమాలు, ట్రీ ప్లాంటేషన్‌లలో భాగస్వామ్యం, బ్యాంకు విజయంలో కీలక పాత్ర పోషించిన వారిని సత్కరించి బహుమతులు అందజేసింది. ఈ సందర్భంగా సీజీఎం రాజేశ్‌కుమార్ ఆధ్వర్యంలో రిటైర్డ్ సీనియర్ ఎగ్జిక్యూటివ్‌లను సత్కరించారు. అనంతరం డాక్టర్స్ డేను ఘనంగా నిర్వహించారు.

*– సిటీబ్యూరో, జూలై 1 (నమస్తే తెలంగాణ)*

# నీట్‌పై ఐక్య విద్యార్థి ఆందోళన

#### పోలీసు కారు అద్దాలు ధ్వంసం

#### ఉద్రిక్తంగా పరిస్థితి.. పలువురి అరెస్టు




విద్యార్థి సంఘాల ప్రదర్శన

ఖైరతాబాద్, జూలై 1: నీట్ అవకతవకలను నిరసిస్తూ వందలాది విద్యార్థులు కదంతొక్కారు. సోమవారం ఒక్కసారిగా వందలాదిగా విద్యార్థులు రాజ్‌భవన్ ముట్టడికి బయల్దేరారు. పోలీసులు అడ్డుకోవడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారి లాఠీచార్జికి దారి తీసింది. విద్యార్థులను అడ్డుకునే క్రమంలో పోలీసు వాహనం సైతం ధ్వంసమైంది. వివరాల్లోకి వెళితే.., నీట్ పరీక్షను రద్దు చేసి తిరిగి నిర్వహించాలని, నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీని రద్దు చేయాలని విద్యార్థి, యువజన ఐక్య సంఘాల ఆధ్వర్యంలో రాజ్‌భవన్ ముట్టడి కార్యక్రమాన్ని చేపట్టారు. ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ నేతృత్వంలో ఎన్‌ఎస్‌యూఐతో పాటు ఎస్‌ఎఫ్‌ఐ, ఏఐఎస్‌ఎఫ్, పీడీఎస్‌యు, వీజేఎస్, పీవైసీ, డీవైఎఫ్‌ఐ, ఎఐవైఎఫ్, వైజీఎస్‌ల సంయుక్తాధ్వర్యంలో చేపట్టిన నిరసన కార్యక్రమం ఉద్రిక్తంగా మారింది. నెక్లెస్ రోడ్డులోని రోటరీ చౌరస్తా వద్ద వారిని పోలీసులు అడ్డుకోవడంతో ఇరువురి మధ్య పెనుగులాట జరిగింది. ఈ క్రమంలో పోలీసు వాహనం అద్దాలు పగిలాయి. దీంతో ఆందోళనకారులపై లాఠీలు ఝులిపించారు. అనంతరం, వారిని అరెస్టు చేసి గోషామహల్ పోలీసు స్టేషన్‌కు తరలించారు. ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ మాట్లాడుతూ, గత 20 రోజుల నుంచి నీట్ విద్యార్థుల పక్షాన ఐక్య విద్యార్థి సంఘాలతో కలిసి ఉద్యమాలు చేస్తున్నామన్నారు. తెలంగాణ రాష్ట్రం నుంచి 70 వేల మంది విద్యార్థులు పరీక్షలు రాశారని, ఈ విషయంపై స్పందించమని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డిని కోరితే, ఆయన పట్టించుకోలేదని, దీంతో ఆయన ఇంటిని సైతం ముట్టడించామన్నారు. గవర్నర్ అపాయింట్‌మెంట్ కోరితే ఇవ్వలేదని, అందుకే రాజ్‌భవన్ ముట్టడికి బయల్దేరామని తెలిపారు.

# ఔటర్ దాకా విపత్తుల విభాగం






- హైడ్రాగా పేరు మార్పు
- ప్రజలకు నిరంతరం సేవలు
- హెచ్‌ఎండీఏ, మూసీ డెవలప్మెంట్ సమీక్షలో సీఎం రేవంత్ రెడ్డి

హైదరాబాద్, జూలై 1(నమస్తే తెలంగాణ): హైదరాబాద్ పరిధిలోని విపత్తుల నిర్వహణ విభాగాన్ని ఔటర్ రింగ్ రోడ్డు వరకు విస్తరించాలని సీఎం రేవంత్ రెడ్డి సూచించారు. సచివాలయంలో మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, హెచ్‌ఎండీఏ, మూసీ డెవలప్మెంట్ అధికారులతో సీఎం సోమవారం సమీక్ష నిర్వహించారు. జీహెచ్‌ఎంసీ, దాని చుట్టూ ఉన్న 27 మున్సిపాలిటీలు, కార్పొరేషన్లు, 33 గ్రామ పంచాయతీల వరకు ఈ విభాగం సేవలు అందించేందుకు అవసరమైన వ్యవస్థాగత మార్పులు చేయాలని సూచించారు. ఇకపై ఈ విభాగాన్ని హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్స్ మానిటరింగ్ ప్రొటెక్షన్ (హైడ్రా) అని పేరు పెట్టాలని ప్రాథమికంగా నిర్ణయించారు. కేవలం వరదలు, ప్రమాదాలు సంభవించినప్పుడే కాకుండా ఇకపై విపత్తుల నిర్వహణ విభాగం సిటీ ప్రజలకు నిరంతరం సేవలందించేలా పునర్ వ్యవస్థీకరణ జరగాలన్నారు. నగరంలో ప్రజలు ఎదుర్కొనే సమస్యలన్నింటిలో హైడ్రా క్రియాశీలకంగా వ్యవహరించాలని స్పష్టం చేశారు. డీఐజీ స్థాయి అధికారి ఈ విభాగానికి డైరెక్టర్‌గా, ఎస్పీ స్థాయి అధికారులు అడిషనల్ డైరెక్టర్లుగా ఉండేలా చూడాలని సీఎం సూచించారు. జీహెచ్‌ఎంసీ, హెచ్‌ఎండీఏ, వాటర్ బోర్డు, సిటీ ట్రాఫిక్, వివిధ విభాగాల నుంచి ప్రత్యేక టీమ్‌లు ఈ విభాగంలో నియమించాలని సూచించారు. జీహెచ్‌ఎంసీ పరిధిలో ఉన్న చెరువులు, కుంటలను పరిరక్షించటం, సిటీలోని నాలాలు, ప్రభుత్వ ఆస్తులు ఆక్రమణలకు గురవకుండా కాపాడే కీలక బాధ్యతలను ఈ విభాగమే చేపట్టాలని నిర్ణయించారు. దీంతో పాటు హోర్డింగులు, ఫ్లెక్సీల నియంత్రణ, తాగునీటి పైపులైన్లు, విద్యుత్తు సరఫరా లైన్లు, డ్రైనేజీలు, వరద నిర్వహణ, ట్రాఫిక్ నియంత్రణ వ్యవహారాలన్నింటిలోనూ ఈ విభాగం సేవలను అందిస్తుంది. అందుకు వీలుగా ఈ విభాగం పునర్ వ్యవస్థీకరణ, సిబ్బంది, విధులు, నిధుల కేటాయింపు, బాధ్యతలపై ముసాయిదా సిద్ధం చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారిని ఆదేశించారు. దీంతో పాటు మూసీ రివర్ డెవలప్మెంట్ ప్రాజెక్టు పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. సిటీలోని చారిత్రక ప్రాధాన్యమున్న కట్టడాలు, శిథిలమైన నిర్మాణాలను పునరుద్ధరించేందుకు, పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు తగిన చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, ఎంఏయూడీ ప్రిన్సిపల్ సెక్రటరీ దాన కిశోర్, జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి, జీహెచ్‌ఎంసీ విజిలెన్స్ విపత్తు నిర్వహణ కమిషనర్ ఏవీ రంగనాథ్, హైదరాబాద్ వాటర్ బోర్డు ఎండీ అశోక్ రెడ్డి పాల్గొన్నారు.